ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

# భారతీయ గిరిజనులు - శాబర మంత్ర విశేషాలు

పరిశోధకుడు : ఎమ్ జె ఎస్ కాళీ కృష్ణ
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

Article Received: 15/04/2026
Article Accepted: 24/05/2026
Published Online: 26/05/2026
DOI:10.53414/Sahithyatharangini.2025.3296

ఉపోద్ఘాతం :

వేదభూమి, కర్మ భూమిగా విశ్వఖ్యాతినార్జించిన ఈ భారతావని జ్ఞానభూమిగా కూడా కొనియాడనడుతుంది. ఇక్కడి మతపరమైన వాతావరణం అణువణువునా భగవంతుడిని దర్శింపచేయడానికి దారులు వేయడం ఇందుకు కారణం. దీనిని సాధించడానికి ప్రతిపాదింపబడిన మార్గమే యోగవిద్య. జీవ బ్రహ్మైక్య సిద్ధిని కలిగించే ఈ యోగమార్గంలో అనేకానేక ఉపశాఖలున్నాయి. వీటిలోని ఒకానొక విశిష్ట యోగమార్గమే మంత్రయోగం. ఈ మంత్రయోగంలో కూడా వారివారి సంప్రదాయాలను బట్టి, వారనుసరించే గురువును బట్టి, శైవం శాక్తేయం లాంటి శాఖలు, అందున వామాచారం, దక్షిణాచారం, కౌలాచారం, సమయాచారం వంటి ఎన్నో పద్ధతులు అనేకం ఉన్నాయి. వీటికనుగుణంగానే వివిధమైన ఆగమ శాస్త్రాలు, తంత్ర గ్రంథాలు కూడా సృష్టించబడ్డాయి. అయితే వీటన్నింటి కంటే భిన్నంగా శబరులుగా పిలువబడే భారతీయ గిరిజనుల మతాచారాల్లోని మంత్ర విధానాలు, వాటి విశేషాలు చాలా విచిత్రంగా కనిపిస్తాయి. వీటి గురించి చర్చించడమే ఈ వ్యాసంలోని ప్రధాన అంశం.

కీలక పదాలు:మంత్రయోగం, శబరమంత్రాలు, గిరిజన సంప్రదాయాలు, తంత్రసాధన, యోగవిద్య.

మంత్రం - అర్థ వివరణ :

' మంత్రం 'అనే పదానికి "మననం క్రియతే రక్షణాయ అస్య, మన్ + త్రల్, అంటే రక్షణ కొరకు దీనిని మనం చేయుదురు", " మననేన త్రాయితే, మన్+త్రై+టచ్, మననము చేస్తే రక్షించునది" (1 )అని, మననాత్

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

త్రాయతే ఇతి మంత్ర - మననం చేయగా తరింపచేయునది అనే వ్యుత్పత్తులు కలవు. మంత్రవేత్తలు మంత్రానికి, ఆ మంత్ర అధిష్టాన దేవతకు, ఆ మంత్రాన్ని ఉపదేశించిన గురువుకు అభేదం చెప్తారు. అంటే ఒక మంత్రం ఆ దేవత యొక్క శబ్దస్వరూపమైన భౌతిక రూపంగా చెప్పబడుతుంది. పదేపదే మన్నం చేయడం వల్ల మననం చేసే సాధకుడిని నిరంతరం రక్షిస్తూ, అతని మానవ జన్మను తరింపచేసి, లౌకిక అలౌకిక ఆనందాలను కలిగించి జీవన్ముక్తిని కలిగిస్తుందని, అందుచేత అది మంత్రం గా పిలువబడుతుందని దీనికి వివరణ.

శాబరమంత్రాలు – ఆవిర్భావం :

మామూలుగా మంత్రాలన్నీ శివుని పంచముఖాల నుండి పుట్టాయని పురాణ కథ (2). అందుకే వేదాలను కూడా ఈశ్వర ప్రధానాలు,అపౌరుషేయాలని అంటారు. మంత్ర శాస్త్రంగా పిలువబడే తంత్ర గ్రంథాలన్నీ కూడా శివుడు పార్వతికి ఉపదేశిస్తున్నట్టు గానీ లేదా భైరవుడు భైరవకి వివరిస్తున్నట్లు గానీ ప్రశ్నోత్తర రూపంలో ఉండటం కూడా మనం చూడొచ్చు. వీటి సాధన క్రమంలో వైదిక పరమైన దక్షిణాచారం, అవైదిక పరమైన వామాచార కౌలాచారాలు వంటి అనేక మార్గాలున్నాయి. ఈ మంత్రాలన్నీ కూడా సంస్కృత భాషలోనే ఉంటాయి.

వేదం, తంత్ర శాస్త్రాల్లోని మంత్రాలుకు భిన్నంగా సంస్కృతంతో పాటుగా ఆయా గిరిజనులు నివసించే ప్రాంతాల్లోని స్థానిక భాషల్లోనూ, ఆయా గిరిజన జాతుల మాతృభాషలోనూ కూడా అనేకానేక మంత్రాలు, మాంత్రిక తాంత్రిక పూజా విధానాలు అనేకం ఉన్నాయి. ఆదివాసీలు, గిరిజనులైన శబరులు ఆచరించే తంత్రాలు మంత్రాలు కావడం వల్ల వీటికి శాబర మంత్రాలని పేరు. వీటికి సంబంధించి ఏర్పడిన మంత్ర శాస్త్రాన్ని శాబర తంత్రంగా పేర్కొంటారు.

శాబర మంత్రాల ఆవిర్భావం గమనిస్తే, ఇవి కూడా పరమేశ్వర ప్రోక్తాలు గానే చెప్పబడుతున్నాయి. దీని గురించి వివరిస్తూ కుర్తాళ పీఠాధిపతులు, మహామంత్రవేత్తగా పేరుపొందిన శ్రీ సిద్ధేశ్వరానంద భారతి స్వామి వారు తెలియజేస్తూ "వేద శాస్త్రములు చదువు లేని వారు, అడవుల్లో నివసించే అమాయకులు - ఇబ్బందులు పడకుండా ఆత్మ రక్షణ, కార్యసిద్ధి - అనుగ్రహించడం కోసం పరమశివుడు కిరాత రూపం ధరించి ఆయా ప్రాంతీయ భాషల్లో మంత్రములనుపదేశించాడని అనుశ్రుతంగా వస్తున్న గాథ"(3) అని అంటారు. అలాగే 'శాబర చింతామణి'' అనే తంత్ర గ్రంథాన్ని 'శాబర తంత్రం' పేరుతో తెనుగించిన కవితా సవ్యసాచి లింగం వీరభద్ర కవి ఈ గ్రంథంలో వివరించిన కథ ఇలా ఉంది.

"సప్త కోటి మహామంత్రాః ఉపమంత్రాః అనేకశః |
తత్కటాక్షాన్ మహాదేవ శ్రుతామే సాంప్రతం ప్రభో ||

అంటూ పార్వతీదేవి శివుడిని మీ వల్ల ఏడు కోట్ల మహామంత్రాలను ఉపమంత్రాలను ఇంకా అనేకానేక మంత్ర తంత్ర విషయాలను అనేకం తెలుసుకున్నాను. వాటితో పాటు భూలోకంలో ఉన్న అనేక శాబర మంత్రాలు

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

గురించి కూడా తెలుసుకోవాలనుకుంటున్నానని, వాటిని గురించి వివరించమని అడుగుతుంది. దానికి శివుడు సమాధానమిస్తూ పూర్వం మత్స్యేంద్ర నాథుడు అనే తన మానస పుత్రుడు ఒకడుండేవాడని, అతని కోరికపై హంస రూపంలో తనకి ఆగమ శాస్త్రాన్ని బోధించానని చెప్తాడు. మత్స్యేంద్ర నాథుడు వాటిని గౌడ (ఒరియా), కేరళ (మలయాళ), కర్ణాటక (కన్నడ), ఆంధ్ర (తెలుగు) గుర్జర (గుజరాతి) ప్రదేశాలకు చెందిన ఐదుగురు శిష్యులకు బోధించాడట.

'తస్య తస్యైవ భాషాయాం మంత్రాన్ తజ్జప లక్షణం |
ప్రయోగం చోపసంహారం ఉక్తవాన్ స చ పార్వతి ||'

అని శివుడు పార్వతికి చెప్పినట్టు ఆ యోగేంద్రుడు తన శిష్యులకు వారి వారి భాషల్లో ఆ మంత్రాలు, వాటిని జపించే విధానాలు, వాటి ప్రయోగ పద్ధతులను, ఉపసంహార విధానాలను ఏర్పరచి ఇచ్చాడట. ఆ కారణంగా స్థానిక భాషల్లో కూడా మంత్రాలు ప్రయోగాలు ఏర్పడినాయి. ఇలా స్థానిక భాషల్లో ఏర్పడిన మంత్రాలు శాబర మంత్రాలు అనే పేరు వచ్చింది"(4). ఇలా ముందు చెప్పుకున్నట్టు ఈ శాబర మంత్రాలు కూడా శంకరుడిచేతనే ఉపదేశించబడ్డాయని చెప్పబడుతున్నాయి.

శాబర మంత్రాలు – విశేషాలు :

ముందు చెప్పుకున్నట్టు శాబర మంత్రాలు ఒరియా, మలయాళం, కన్నడ, ఆంధ్ర ,గుజరాతి భాషలలోనే కాకుండా హిందీ, తమిళ ,సంస్కృత భాషల్లో కూడా కలవు. హిందీ భాషలో ఈ మంత్రాలకు సంబంధించి 600కు పైగా పేజీలు గల 'శాబర మంత్రసాగర్' అనే పేరుతో ఒక మహాగ్రంథమే ఉంది. ఇతరేతర మంత్రాలలాగే వీటిలో కూడా యోగ సిద్ధిని కలిగించి బ్రహ్మ సాక్షాత్కారాన్ని సాధించే మంత్రాలు ఉండటమే కాకుండా షట్కర్మలుగా పేరుపొందిన శాంతి,, వశీకరణ, స్తంభన, విద్వేషణ, ఉచ్చాటన , మారణమనే ఆరు ప్రక్రియలకు చెందిన మంత్రాలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ కూడా తంత్ర ప్రధానంగా సాగేవే. కొన్ని సాధారణంగా సర్వులు పాటించగలిగేలా ఉన్నప్పటికీ, కొన్ని మద్య ,మాంస, మత్స్య, ముద్ర , మైథునాలనే పంచమకారయుక్త సాధనా సమన్వితాలై కూడా ఉన్నాయి. శ్రీ సిద్ధేశ్వరానంద భారతి స్వామి చెప్పినట్లు వేదాది శాస్త్రాలు చదవలేని వారు, అడవుల్లో జీవిస్తూ బ్రతికేవారు, జానపదులు సైతం వారి వారి భౌతిక అలౌకికమైన జీవితాన్ని మెరుగుపరచుకోవడం కోసం తేలికగా ఉచ్చరించగలిగేలా ఉండటం వీటి మరో ప్రత్యేకత.

శాబరేతరమైన వైదికాది మంత్రాలను సిద్ధింపచేసుకోవడానికి సుదీర్ఘంగా అధికమైన పురశ్చరణలు చేస్తూ సాధన చేసినట్టుగా వీటిని సాధన చేయవలసిన అవసరం లేదు. "ఈ విద్యలు ఎక్కువ పురశ్చరణలు లేకుండా హోమములు మొదలైన ప్రక్రియలు అవసరం లేకుండా సిద్ధిస్తవి. అయితే గురుపరంపరలో వచ్చినప్పుడు మాత్రమే అవి పని చేస్తవి"(5). ఇదే విషయాన్ని స్వయంగా పార్వతీదేవి శివుడిని ఈ శాబర మంత్ర సాధన క్రమాన్ని వివరించమని అడిగే సందర్భంలో "శాబరం మంత్ర శాస్త్రంచ వినాయాస తపః ఫలం|

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

వదమే దేవ దేవేశ కరుణాకర శంకర ||" (6)అని శంకరుడుని ప్రార్థిస్తుంది. అయితే వీటిలో అతి చిన్న వాటి నుండి రెండు మూడు పేజీలు ఉండే పెద్ద పెద్ద మంత్రాలు కూడా శాబర మంత్రసాగర్ లో మనకు కనిపిస్తాయి. వీటిలో తెలుగు మంత్రాలయితే ఎక్కువగా గురు ప్రసాదం, గురుపాదం, దిక్కులు, పంచభూతాలు ,వేదాల మీద ఆన - ఒట్టు అనే పదాలతోనూ, హిందీలో ఆదేశ్ గురూ, ఈశ్వరో వాచా లేదా పురోవాచా వంటి పదాలతో ఇలా అనేక రకాలుగా ఉంటాయి. మచ్చుకకు శాబర మంత్రాలు కొన్నింటిని అవగాహన కోసం చూచాయిగా పేర్కొనడం జరుగుతుంది.

పైన చెప్పుకున్నట్టు అలౌకికమైన అంశాలకు సంబంధించినవే కాకుండా లౌకిక జీవితంలో ఎదురయ్య అనే సమస్యలకు, అవసరాలకు ఎక్కువగా వీటిని ఉపయోగించడం వాడుకలో ఉన్న విషయం. ఉదాహరణకి జీవితంలో ఏదో ఒక సమయంలో ప్రతి మనిషికి ఏదో ఒక విధంగా అపాయం, ప్రమాదం వంటివి రావడం సహజం. అటువంటి వాటినుండి రక్షణ కోసం నిర్దేశించబడినది ఈ క్రింది మంత్రం. దీన్ని ఆత్మ రక్షాకరీ మంత్రం అంటారు. పఠన సౌలభ్యం కోసం హిందీలో ఉన్న ఈ మంత్రాన్ని ఇక్కడ తెలుగులో ఇస్తున్నాను – "ఓం నమో బజ్ర్ కా కోఠా జీసమేం పిండ్ హమారా పైఠా"(7).

అలాగే వాకట్టు విద్యగా చెప్పబడే మన తెలుగు భైరవి మంత్రం – "ఆం కట్టు ఊమ్ కట్టు ఊమ్ పట్టుకట్టు వింగ్ వంగ్ అట్టు, భైరవ పాదమాన పట్టుకట్టు స్వాహా" – " విడుపు మంత్రం - ఓం శక్తి గణపతి, చండాల భైరవి నేను తలచినపుడే విడిచిపెట్టు పటు స్వాహా"(8).

ఇలాంటిదే కొండ దేవత - పంచపాండవులు కట్టు విడుపు మంత్రాలుగా చెప్పబడే కొండ జాతి వారి మంత్రం – "కట్టు: వాసారి మిందారి, యర్రాల మందారి అంటూరి మిందారి, వుండూరు మిందారి నీరుకు మింద ఇల్లవర","విడుపు: యిటి కీలు మందారి నాగూరు మిందారి మడియాల భూపతి"(9).

అలాగే రోగోపశమనానికి ఉద్దేశించబడిన "ఓం నమో భగవతే అఘోర రుద్రాయ సకల రోగ విధ్వంసకాయ భూతప్రేత పిశాచ సంహార కారణ కృత్రిమ విధ్వంసనాయ ఏ హి ఏ హి ఆముఖం ఉమ్మనే వారు ఉమక్క కాలరుద్రానే చారు రోగతే తోరు పిశాచంగాలై పోట్టం చటకం గలే అడిచితో వద్దలు ఉమక ఘోర సత్యారాయ్ ఓం గం అఘోర రుద్ర ఓం గురు ప్రసాదం"(10) అనే మంత్రం.

ముగింపు :

మొత్తం మీద వైదిక, ఇతర మంత్ర శాస్త్రాలన్నింటి కంటే భిన్నంగా కొంతవామాచారంతో కూడుకున్నదై ఉన్నప్పటికీ శబరులు అవలంబించే ఈ శాబర తంత్ర శాస్త్రం తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని కొనసాగుతూ ఉంది. దీన్ని జాగ్రత్తగా గమనించినట్లయితే మరికొన్ని నూతన అంశాలను పరిశోధనల ద్వారా వెలికి తీయవచ్చు. పైన పేర్కొన్న ఉదాహరణలే కాకుండా పాముకాటుకు, తేలుకాటుకు,సర్పి, కంఠసర్పి వంటి మొండి రోగాలకు సంబంధించిన శబర మంత్రాలు, తాంత్రిక ప్రక్రియలు కూడా ఈ శాబర మంత్ర శాస్త్రంలో మనం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

అనేకం గమనించవచ్చు .ఇవి కేవలం ససశబరులు ,గిరిజనుల్లోనే కాక నేటికీ గ్రామీణ ప్రజల్లోనూ,కొన్ని చోట్ల పట్టణ ప్రాంతాలలోనూ గురుపరంభంలో భాగంగా కొనసాగుతూనే ఉన్నాయన్న విషయం సర్వులకు సుపరిచితమైన విషయం. ఈ శాబర మంత్రాల్లో చాలా విశిష్టంగా వ్యవహారంలో ఉన్న పాము కాటు మంత్రానికి మాసాబత్తుల వీరయ్య అనే వ్యక్తి ఒకప్పటి ఆంధ్రదేశంలో ఈ చాలా ప్రసిద్ధి చెందిన వ్యక్తిగా పేర్కొనబడుతున్నారు. అయితే మారుతున్న సమాజం పెరుగుతున్న నాగరికత శాస్త్ర సాంకేతికతల వల్ల ఇవి కొంత మరుగును పడుతున్నాయి. వీటిపై నూతన పరిశోధకులు మరింత పరిశోధన చేసి మరికొన్ని కొత్త అంశాలను వెలుగు తీయగలరు.

పాద సూచికలు:

- ఆచార్య ముదిగంటి గోపాలరెడ్డి, సంస్కృత -తెలుగు వ్యుత్పత్తి పదకోసం, పుట్ట సంఖ్య – 617.
- శ్రీ విశ్వనాథం సత్యనారాయణమూర్తి - శ్రీ శివ మహాపురాణం, తెలుగు వచనం. పుట్టసంఖ్యలు – 24,25
- శ్రీశ్రీశ్రీ సిద్దేశ్వరానంద భారతి స్వామి ,మన సమస్యలు – మంత్రసాధనలు. పుట సంఖ్య – 53.
- లింగం వీరభద్ర కవి – శాబర తంత్రము. పుట సంఖ్య – 5.
- శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతి స్వామి, మన సమస్యలు – మంత్రసాధనలు. పుట సంఖ్య – 53.
- లింగం వీరభద్ర కవి – శాబర తంత్రము, పుటసంఖ్య – 11.
- ఎస్.ఎన్.ఖండేలావాల్ ( సంగ్రహ కర్త ) శాబర మంత్ర సాగర్. పుట సంఖ్య – 14.
- శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతి స్వామి, మన సమస్యలు - మంత్ర సాధనలు, పుట సంఖ్య – 59.
- శ్రీశ్రీశ్రీ సిద్దేశ్వరానంద భారతి స్వామి, మన సమస్యలు - మంత్ర సాధనలు, పుటసంఖ్య – 67.
- లింగం వీరభద్ర కవి - శాబర తంత్రము, పుట సంఖ్య – 50.

ఆధార గ్రంథాలు:

1) మన సమస్యలు - మంత్ర సాధనలు - శ్రీ శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి, పంచమ ముద్రణ,2023.

2) శాబర తంత్రము - లింగం వీరభద్ర కవి, గుంటూరు పబ్లిషింగ్ హౌస్, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్, 2023 ముద్రణ.

3) శాబర మంత్రసాగర్ - ఎస్ ఎన్ ఖండేలావాల్ .

4) శ్రీ శివ మహాపురాణం – శ్రీ విశ్వనాథం సత్యనారాయణ మూర్తి, తెలుగు వచనం.

5) సంస్కృత - తెలుగు వ్యుత్పత్తి పదకోశః - ఆచార్య ముదిగంటి గోపాలరెడ్డి.